ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 1 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	230
సూర్యాపేట	రూ.140	200	230
నల్లగొండ	రూ.140	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.2

• భక్తి ప్రపత్తులతో రంజాన్

నల్లగొండలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



8

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధల మధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాల వద్ద సందడి కనిపించింది. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రముఖులు ఈద్గాల వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

యాదాద్రి క్షేత్రం భక్తజన సందోహం •



వరుసగా సెలవులు రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. దీనికి తోడు ఉగాది పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో స్వామి వారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ క్రమంలో కొండపైన ఎక్కడ చూసినా భక్తజన సందోహం కనిపించింది. దర్శన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు.

7



ఎంతమందికి... ఎన్నిస్తారు?

లక్ష్యాలను నిర్దేశించని రాష్ట్ర ప్రభుత్వం

రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులకు ఆహ్వానం

కార్పొరేషన్ల ద్వారా పథకం అమలు » బ్యాంక్ కాన్సెంట్ పత్రం తప్పనిసరి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను బలోపేతం చేస్తూ, వాటి ద్వారానే యువతకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని కార్పొరేషన్ల ఆధ్వర్యంలోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. మార్చి 17 తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా పలు యూనిట్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ఎంతమందికి రుణ సదుపాయం కల్పిస్తారన్న లక్ష్యాలను ఇంకా వెల్లడించలేదు. దీంతో దరఖాస్తుదారుల్లో ఎంతమందికి ఈ రుణసదుపాయం కలుగనుందోనని సందిగ్ధంగా ఉంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

'రాజీవ్ యువ వికాసం' పథకంలో రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ పథకం కింద యువత పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఏయే కార్పొరేషన్ల కింద ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నది ప్రభుత్వం స్పష్టం...

- మిగతా 7వ పేజీలో...



రీసైక్లింగ్ దందా ఆగేనా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేళ్లూనుకున్న రేషన్ బియ్యం అక్రమదందాకు చెక్‌పడనుందా?, సన్నబియ్యం పంపిణీ పథకం మిల్లర్లు, రేషన్ డీలర్లు, అక్రమ వ్యాపారులకు పచ్చి వెలక్కాయ కానుందా అంటే సివిల్ సప్లయ్ అధికారులు అవుననే అంటున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. ఎంత చెప్పినా మిల్లర్లు వినడం లేదని, గత ప్రభుత్వం చేసిన తప్పులను దిద్దుతూ అక్రమదందాకు చెక్‌పెడుతున్నట్లుగా చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక రేషన్ రీసైక్లింగ్‌కు చెక్‌పడినట్లుగా భావిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

» సీఎం ఘాటు వ్యాఖ్యలతో కలకలం

» ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యంతో ప్రతినెలా దాదాపు రూ.42 కోట్ల దందా

» సన్నబియ్యంతో పంపిణీతోనైనా అడ్డుపడుతుందని ఆశాభావం

బహిరంగ సభలోనే ఏకంగా ముఖ్యమంత్రి స్వయంగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ దందా నియంత్రించలేని స్థితికి వెళ్లిందని పేర్కొనడం ఉమ్మడి జిల్లాలో కేంద్రీకృతమైన మాఫియా తీరుని తెలియజేస్తోంది. సన్నబియ్యం పంపిణీతోనైనా ఈ రేషన్‌బియ్యం రీసైక్లింగ్ దందాకి తెరపడుతుందనే ఆశాభావాన్ని సీఎంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు బహిరంగంగానే పేర్కొనడం జిల్లాలో వేళ్లూనుకుపోయిన రేషన్‌బియ్యం అక్రమదందా తీరుని తెలియజేస్తోంది.

"గత ప్రభుత్వం రాష్ట్రంలోని రైస్‌మిల్లుల వద్ద 21 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం దాచిపెట్టింది. మా ప్రభుత్వం ఏర్పాటయ్యాక మిల్లర్ల సమావేశం పెట్టి ఆ ధాన్యమైనా ఇవ్వండి లేదంటే డబ్బులైనా ఇవ్వండి అంటే పైసలూ కట్టడం లేదు. ధాన్యమూ ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మూడుకోట్ల మందికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే, వారి నుంచి ఆ బియ్యాన్ని కిలో రూ.10కే మళ్లీ మిల్లర్లు కొంటున్నారు. వాళ్లు అవే బియ్యాన్ని మళ్లీ ప్రభుత్వానికి రూ.30కి అమ్ముతున్నారు. సీఎంగా, మంత్రులుగా ఈ సైక్లింగ్ వ్యవహారమంతా చూ శాం. ఏడువేల మెట్రిక్‌టన్నుల ధాన్యానికి వేలం వేస్తే, మూడువేల మెట్రిక్ టన్నుల ధాన్యమే వచ్చింది. ఇంకా నాలుగువేల టన్నుల ధాన్యం రాలేదు. మిల్లర్లు సహకరించడం లేదు. దొడ్డుబియ్యం పంపిణీకి ఖర్చుచేస్తున్న దాదాపు రూ.10వేల కోట్ల ప్రజాధనం దళారీలు, మాఫియాకు ఉపయోగపడిందే తప్ప, ప్రజలకు వాటితో ఉపయోగంలేదు. అందుకే తమ ప్రభుత్వం దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం ఇస్తున్నాం." ఇవి స్వయంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి రేషన్‌బియ్యం రీసైక్లింగ్‌పై హుజూర్‌నగర్ సభలో సీఎం చేసిన వ్యాఖ్యలివి.



డీలర్లు, అక్రమవ్యాపారులు కలిసి రేషన్ బియ్యం సేకరణ..

నల్లగొండ జిల్లాలో రేషన్ బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరించి ఆ బియ్యాన్ని లారీల్లో పొరుగు రాష్ట్రాల్లోని పోర్టులకు, మద్యం కంపెనీలకు విక్రయించే మాఫియా జిల్లాలో వేళ్లూనుకుపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌డీలర్లు, అక్రమవ్యాపారులు, కొందరు రైస్‌మిల్లర్లు ఈ మాఫియాతో చేతులు కలిపి ప్రతినెలా పెద్దసంఖ్యలో రేషన్ బియ్యాన్ని దొడ్డిదారిలో విక్రయిస్తున్నారు. సివిల్‌సప్లయిశాఖ అధికారులకు ఈ దందాపై అవగాహన ఉన్నప్పటికీ నామమాత్ర పు తనిఖీలు, కేసులతో సరిపుచ్చుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో నియంత్రించలేని దుస్థితి కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో రేషన్ దుకాణాల డీలర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇష్టపడని వారికి డబ్బులు లేదంటే ఇతర వస్తువులను ఇచ్చి...

- మిగతా 7వ పేజీలో...

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి):మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద మైనార్టీలకు అందేలా చూస్తామన్నారు. పేద ముస్లింలకు ఇళ్ల కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్లు లేనివారికి ప్లాట్లు ఇచ్చి రూ.ఐదు లక్షలతో ఇల్లు కట్టిస్తామన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతో సుఖంగా ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించాలని చూస్తోందని విమర్శించారు. దేశఐక్యత కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ ,మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఆర్‌యూవీకి దరఖాస్తుల గడువు పొడిగింపు

నల్లగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం(ఆర్‌యూవీ) కింద స్వయం ఉపాధి పొందేందుకు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలి సి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రజా సేవ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయంలోని ప్రజాసేవకేంద్రాల్లో మ్యానువల్‌గా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 22,356 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించామన్నారు. అందులో నల్లగొండ, మిర్యాలగూడ నుంచి ఎక్కువగా దరఖాస్తు లు వచ్చాయన్నారు. ఈ నెల 14లోగా దరఖాస్తులు చేసుకునేలా అన్ని మండలాలు, మునిసిపల్ కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తామని, అదేవిధంగా ఠంకు వేయిస్తామన్నారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో 18004251442 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈనెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోవచ్చని



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి,అధికారులు

పథకం అమలుకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. కార్యక్రమంలో అదనపు జేసీ జే శ్రీనివాస్, జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ రాజేశేఖర్‌రెడ్డి, గృహనిర్మాణ పీడీ రాజ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

వేద పాఠశాలకు స్థలం అప్పగింత

» ఈవోకు భూమిపత్రాలు అందజేసిన చీఫ్ ప్లానింగ్ అధికారి

» వైటీడీఏ పరిధిలోని 15 ఎకరాలు కేటాయింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వేద పాఠశాలకు మార్గం సుగమమైంది. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సుముఖత వ్యక్తం చేయగా, తాజా వైటీడీఏ పరిధిలోని 15 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం వైటీడీఏ చీఫ్ ప్లానింగ్ అధికారి అశ్వినియాదవ్ భూమి పత్రాలను ఈవో భాస్కర్ రావుకు అందజేశారు. అయితే వేదపాఠశాలతో పాటు సంస్కృత పాఠశాలను కూడా అక్కడికే తరలించనున్నారు. దీంతో ప్రశాంత వాతావరణంలో బాలురు వేదభ్యాసం చేయనున్నారు.ఇందుకోసం సుమారు రూ.23.79కోట్లను వెచ్చించనున్నారు.

- వివరాలు 6లో

ఒక్క రోజులో 110 రిజిస్ట్రేషన్లు

» చివరి రోజున ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు

» పండుగ సెలవు ఉన్నా పనిచేసిన ఎస్‌ఆర్ కార్యాలయాలు

» ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1,528 డాక్యుమెంట్లు నమోదు

నల్లగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) అమలులో భాగంగా ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సోమవారం ఒక్కరోజే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 110 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. రంజాన్ పండుగ సెలవుదినం అయినప్పటికీ సెలవును రద్దు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నడిచేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించడమే కాకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కూడా ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రమబద్ధీకరణ ఫీజులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాయితీ వర్తించేలా ఆదేశాలు ఇచ్చింది.

దీంతో మార్చి 31న సెలవు దినం అయినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కావడంతో సెలవు దినాన్ని పనిదినంగా మార్చి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు హాజరు కావాలని ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. అదేవిధంగా బ్యాంకులు కూడా పనిచేశాయి.

ఒక్క నకిరేకల్‌లోనే 48..



మొత్తం 15సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం 110 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. నకిరేకల్ పరిధిలోనే ఎక్కువగా 48 ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి. మోత్కూరు, చండూరు, చండూరు, దేవరకొండ, నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవకాశం కల్పించినప్పటికీ ఎటువంటి రిజిస్ట్రేషన్లు నమోదు కాలేదు. భువనగిరి కార్యాలయంలో 8, బీబీనగర్‌లో 8, చౌటుప్పల్ 5, రామన్నపేటలో 6, యాదగిరిగుట్టలో 8 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొత్తంగా ఈ జిల్లాలో 35 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కు నోచుకోగా, నల్లగొండ జిల్లాలో నకిరేకల్‌లో 48, నిడమూరులో 4 మొత్తంగా 52, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడలలో ఒక్కొక్కటి చొప్పున, సూర్యాపేటలో 21 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొత్తంగా ఈ జిల్లాలో 23 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నారు.

ఇప్పటి వరకు 1,528 రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం ప్రారంభమైన నాటి నుంచి సోమవారంవరకు 1,528 దరఖాస్తులు రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

కార్యాలయం	డాక్యుమెంట్లు
యాదాద్రి జిల్లాలో...	
బీబీనగర్	140
చౌటుప్పల్	30
మోత్కూరు	30
రామన్నపేట	44
యాదగిరిగుట్ట	233
నల్లగొండ జిల్లాలో..	
చండూరు	23
దేవరకొండ	72
మిర్యాలగూడ	81
నల్లగొండలో	68
నకిరేకల్	113
నిడమూరు	85
సూర్యాపేట జిల్లాలో...	
హుజూర్‌నగర్	27
కోదాడ	160
సూర్యాపేట	270

ఉపాధి కూలీలకు తీపికబురు

» పెరిగిన కూలి రేట్లు

» రోజుకు రూ.300 నుంచి రూ.307

» ఉమ్మడి జిల్లాలోని 15.35 లక్షల మంది కూలీలకు లబ్ధి

కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు తీపికబురు చెప్పింది. కూలి రేట్లు పెంచు తూ ఉత్తర్వులు జారీ చేసింది. రోజు వారీ కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచింది. గతేడాది పోలిస్తే రూ.7లు పెరిగింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15.35 లక్షల కూలీలకు లబ్ధిచేకూరనుంది. నేటి నుంచి పనుల్లోకి వచ్చే వారికి ఈ రేట్లు వర్తించనున్నాయి. పదేళ్లలో 62.86శాతం కూలి రేట్లను కేంద్రం పెంచింది.

- వివరాలు 7లో

అందంగా.. ఆకట్టుకునేలా..

- కొత్త రూపు సంతరించుకుంటున్న వంటిల్లు
- రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు
- ఖర్చుకు వెనుకాడని యజమానులు
- మెరిసేలా గ్రానైట్, కప్‌బోర్డుల ఏర్పాటు



అత్యాధునిక హంగులతో కిచెన్

ఇల్లు చూడు, ఇల్లాలిని చూడమన్నారు పెద్దలు. ఇంట్లో ఇల్లాలు ఆనందంగా ఉంటే ఆ కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుంది. ఇంటికి అందం ఇల్లాలే, దీపం పెట్టే మగువ అన్ని వేళలా హాయిగా ఉండాలన్నా, ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉండాలన్నా ప్రధానంగా వంటగది బాగుండాలి. ఎందుకుంటే కుటుంబ సభ్యులందరికీ రుచిగా, శుచిగా వేడివేడిగా వండి వడ్డించాలంటే సకల సౌకర్యాలతో వంటగది ఎంతో అత్యవసరం. అందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా వంటగదులు కూడా నూతన సొబగులు అద్దుకుంటున్నాయి. కట్టెల పొయ్యి నుంచి కిరోసిన్ స్టవ్‌లు, గ్యాస్టొవ్‌లు, ఎలక్ట్రిక్ పొయ్యిలు, మైక్రోవేవ్ ఓవెన్లు అందుబాటులోకి వచ్చేశాయి. ఇలా ఎప్పటికప్పుడు ఎవరి స్థాయిని బట్టి వారు సామాన్య, మధ్యతరగతి నుంచి ధనికుల వరకు తమ అభిరుచికి అనుగుణంగా అన్ని హంగులతో వంటిళ్లిని సకల సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఇంటి నిర్మాణంతో పాటు అపార్ట్‌మెంట్ ప్లాట్ కొనుగోలు చేసే సమయంలోనే పక్కా ప్రణాళికతో రూపొందించుకుంటున్నారు. గాలి, వెలుతురు బాగా ఉండేలా, అదీ వాస్తు ప్రకారం ఆగ్నేయంలో వంటగది ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీలును బట్టి రెండు కిటికీలు, ఒక్కటే అయితే కాస్త పెద్ద కిటికీ ఏర్పాటు చేస్తున్నారు. వంట గదిలో సాధారణంగా ఉక్కపోసి చికాకుగా ఉంటుంది. గతంలో వంట చేసి బయటకు వచ్చే సరికే చెమటలతో తడిసిపోయి వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. బయటి గాలి లోపలకు వచ్చేలా, లోపలి వంట వేడి గాలి, ఆవిరి వెలుపలకు పోయేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ విధంగానే వంట గదులు రూపుదిద్దుకుంటున్నాయి. గ్యాస్ సిలిండర్లు సాధారణంగా వీలుంటే కిచెన్‌కు వెలుపలే ఉండేలా కొందరు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్లలో వెలుపల గ్యాస్ సిలిండర్లు పెట్టే సౌకర్యం లేని వారు వంట గదిలోనే లోపల వాటిని పెట్టుకునేలా ఏర్పాట్లు చేసుకుని, పొరపాటున గ్యాస్ లీకైనా బయటకు వెళ్లే విధంగా జల్లెడలు అమర్చుకుంటున్నారు. ఓ మోస్తరు సైజు వంటగదికి రూ.50 వేలు మరింత అందంగా సౌక ర్యాలతో కలిపి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తూ వంటిల్లును ఆకట్టుకునేలా రూపొందించుకుంటున్నారు. వంటగది సైజు ఇంకా ఎక్కువగా ఉంటే కాస్త ఖర్చు ఇంకా పెరిగినట్లే.

అత్యాధునిక హంగులతో...

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక యుగంలో కిచెన్లు కూడా అంతే అత్యాధునిక హంగులతో చూడముచ్చటగా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. ఇప్పుడున్న ట్రెండ్‌కు అనుగుణంగా గ్యాస్ పొయ్యిలు పైకి కనిపించకుండా గ్రానైట్‌లోనే అమర్చుకునే వీలుంది. ఆవిధంగానే కొందరు ఇష్ట పడుతున్నారు. మైక్రోవేవ్ ఓవెన్స్‌ను కూడా వంటగదిలో సెట్ అయ్యేలా అమర్చుతున్నారు.

దీంతో శుభ్రం చేసుకునేందుకు సులభంగా ఉంటుంది. చెంచాల దగ్గర నుంచి తినే పళ్లాలు, కప్‌లు వంటకు ఉపయోగించే గిన్నెలు, పాత్రలు, బయటకు కనిపించకుండా వేటికవే రాక్స్, బాస్కెట్లు ఏర్పాటుచేస్తున్నారు. బియ్యం డ్రమ్ములు పెట్టుకునేందుకు, వంటకు ఉపయోగించే దినుసులు, వంట నూనెల బాటిల్స్, కూరగాయలు తరిగే సామగ్రి ఇలా సకల సరంజామా పెట్టుకునేందుకు బాటిల్ యూనిట్లు, కూరగాయల బాస్కెట్లు అందుబాటులోకి వచ్చేశాయి. వంట ఆవిరికి గోడలకు కప్‌బోర్డులకు జిడ్డు పట్టకుండా ఎప్పటికప్పుడు ఆవిరి వెలుపలకు వెళ్లేందుకు ఆధునిక చిమ్నీలు అమర్చుతున్నారు. బ్రేక్‌ఫాస్ట్‌కౌంటర్ సైతం వంటగదిలోనే ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనినే కూరగాయలు కటింగ్ టేబుల్‌గా కూడా వినియోగించకోవచ్చు. ఒక్క సామగ్రి కూడా బయటకు కనిపించకుండా అన్నీ అందుబాటులో ఉండేలా అభిరుచికి తగినట్లు వంటిల్లు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు.





రూ.5 లక్షల వరకు ఖర్చు వచ్చింది



వంటగదికి రూ.5లక్షల వరకు ఖర్చు వచ్చింది. వంటకు ఉపయోగించే వస్తువులు బయటకు కనిపించకుండా ఉండాలంటే కప్‌బోర్డులు తప్పని సరి. లేదంటే వస్తువులు అన్ని చిందర, వందరగా ఉంటాయి. దీంతో వంటిట్లో మహిళలు వంట చేయాలంటే చిరాకు కలుగుతోంది. ఈక్రమంలో వంటగదిలో నిర్మాణంలో వస్తున్న మార్పులు కనుకుణంగా, మహిళలు కోరుకునే విధంగా ఆధునిక నిర్మాణాలు చేయాల్సి వస్తుంది. అవసరం కూడా. దీంతో ఖర్చుకు వెనుకాడకుండా, ఇంటికి రూ. 60 లక్షల ఖర్చు వస్తే, వంటగదికి రూ 5లక్షల ఖర్చు చేయాల్సి వచ్చింది.

- దొండెటి శ్రీనివాసరావు, కోదాడ

పనులన్నీ చకచకా అవుతాయి



20 ఏళ్ల క్రితంతో పోల్చితే వంట గది నిర్మాణంలో చాలా మార్పులు వచ్చాయి. గతంలో కట్టెల పొయ్యి మీద అన్ని చేయాలంటే పొగతో మహిళలు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. కట్టెల స్థానంలో కిరోసిన్ స్టౌలు రావడం వాటితో మహిళలు ఇబ్బందులు చూడాల్సి వచ్చింది. కిరోసిన్ స్థానంలో గ్యాస్ రావడంతో కొంత మేరకు మహిళలకు వంటింటి కష్టాలు తగ్గాయి. అయినా వంటగదిలో వస్తువులు గజిబిజీగా ఉంటే చిరాకు వస్తుంది. వంట చేయాలంటే ఇబ్బందిగా ఉంటుంది. వంటగది నిర్మాణంలో మార్పులు చోటు చేసుకోవటం, ఆధునిక సౌకర్యాలు రావటంతో మహిళల కష్టాలు తొలగినట్లేయింది. దీంతో మహిళలు ఇంట సామగ్రి కనిపించకుండా ఉండేందుకు అవసరమైన అన్ని హంగులతో కిచెన్ నిర్మాణాలను ఇష్టపడుతున్నారు. కాస్త ఖర్చు ఎక్కువ అయిన వెను కాడటం లేదు. ఇంటిల్లిపాది వారివారి పనులకు వెళ్లాలం టే సకాలంలో పనులు పూర్తి కావాలి. అది జరగాలంటే వంటిల్లు శుభ్రంగా ఉంటేనే సాధ్య మవుతుంది. పనులు చకచకా అయిపోతాయి.

- వక్కవంతుల వాహిని, గృహిణి,కోదాడ

సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	521.70
టీఎంసీలు	152.3944
ఎడమకాల్వకు నీటి విడుదల	7190
కుడికాల్వకు	5088
విద్యుత్ కేంద్రం ద్వారా	0
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1300 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	0
అవుట్‌ఫ్లో	13,938 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	623.93 అడుగులు
టీఎంసీలు	0.75
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	367.51 క్యూసెక్కులు

నేడు నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నల్లగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిలాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11.10 గంటలకు కనగల్ మండలం జి.యడవల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీని, ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అదే గ్రామంలో రూ.4కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఒంటి గంటకు యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనకు వెళ్తారు. మధ్యాహ్నం 1.35గంటలకు యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆలేరు నియోజకవర్గానికి సంబంధించిన సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించి, మహిళా సంఘాలకు చెక్కులను అందజేస్తారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్తారు.

వేద పాఠశాలకు స్థలం అప్పగింత

- గుండ్లపల్లి, దాతారుపల్లి రెవెన్యూలో...
- టెంపుల్ సిటీలో 15 ఎకరాలు ఎంపిక
- రూ.23.79 కోట్లతో నిర్మించేందుకు నిర్ణయం



యాదగిరిగుట్ట, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి క్షేత్రంలో వేద పాఠశాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే సుముఖత వ్యక్తం చేయగా సోమవారం వైటీడీఏ చీఫ్ ప్లానింగ్ అధికారి అశ్వినియాదవ్ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఈవో భాస్కర్‌రావుకు అప్పగించారు. ఇది వరకే ప్రకటించినట్లుగా 250 ఎకరాల టెంపుల్ సిటీకి చెందిన భూమిలోంచి 15 ఎకరాల భూమిని కేటాయించి హద్దురాళ్లను నిర్ణయించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎన్ శ్రీధర్ ప్రత్యేకశ్రద్ధతో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్), వైటీడీఏ, వైటీడీ మూడు శాఖల ద్వారా భవనం నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.23.79కోట్లతో నిర్మించనున్నారు.


పెద్దగుట్టపై మ్యాప్‌ను ఈవో భాస్కర్‌రావుకు అందజేస్తున్న వైటీడీఏ సీపీవో అశ్వినియాదవ్

సంస్కృత పాఠశాల సైతం...

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దేవాదాయ మంత్రి కొండా సురేఖ చేపట్టిన సమీక్షలో వేద పాఠశాల ఏర్పాటుకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ చొరవతో ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వేద పాఠశాల నిర్మాణానికి వేగంగా సన్నాహాలు ముందుకు సాగుతున్నాయి. అయితే వేద పాఠశాలకు కేటాయించిన స్థలానికి సంస్కృత పాఠశాలను కూడా తరలించాలని యోచిస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇప్పటివరకు సంస్కృత పాఠశాల కొండకింద బస్టాండ్ ఎదురుగా శబ్దకాలుష్యం నడుమ కొనసాగుతోంది. ఎప్పటి నుంచో తరలింపుపై దృష్టి సారించిన ఈవో ప్రత్యేక చొరవతో సంస్కృత పాఠశాలను వేద పాఠశాల చోటికి తరలించేందుకు ప్రతిపాదించారు.

15 ఎకరాలు, రూ.23.79కోట్లు

యాదగిరి క్షేత్రానికి అభిముఖంగా ఉన్న పెద్దగుట్టపై అత్యాధునిక హంగులు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేదపాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు యాదగిరిగుట్ట మండలం గుండ్లపల్లి గ్రామ సర్వే నంబరు 169లో 12.11 ఎకరాలు, దాతారుపల్లి సర్వే నంబర్లు 154లో 2.01, 156లో 0.28 గుంటలు మొత్తం 15 ఎకరాలు కేటాయించారు. రెవెన్యూ, వైటీడీఏ అధికారులు ఈ స్థలాన్ని సందర్శించి హద్దురాళ్లను కూడా నిర్ణయించారు. ఈ స్థలంలో వేద పాఠశాల నిర్మించేందుకు సర్వం సిద్ధం కాగా ఈవో ప్రతిపాదనల మేరకు ఇక్కడే సంస్కృత విద్యను అభ్యసిస్తున్న సుమారు 70మంది విద్యార్థుల కలిగిన పాఠశాల కూడా నిర్వహించేందుకు వైటీడీఏ అధికారులు సుముఖతను వ్యక్తం చేశారు. కాగా, పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.23.79 కోట్లు కేటాయించింది. ఇందులో సీజీఎఫ్ నిధులు రూ.13.79కోట్లు, వైటీడీఏ రూ.5కోట్లు, వైటీడీ రూ.5 కోట్లు కలిపి మొత్తం రూ.23.79కోట్లతో నిర్మించనున్నారు.

నిర్మాణ ప్రక్రియే మిగిలింది

టెంపుల్ సిటీకి కేటాయించిన భూమిలో 15 ఎకరాలకు వేద పాఠశాల నిర్మాణానికి హద్దురాళ్లను నిర్ణయించాం. అన్ని హంగులతో ఆధ్యాత్మిక భావన పెంపొందించే రీతిలో భవనం నిర్మితంకానుంది. ప్రస్తుతం కొండ కింద బస్టాండ్ ఎదురుగా శబ్ద కాలుష్యంలో కొనసాగుతోన్న సంస్కృత పాఠశాలను కూడా వేద పాఠశాల నిర్వహించే చోటికి తరలించేందుకు ప్రతిపాదించా. వేదాలు నేర్చుకునే విద్యార్థులకు అవసరమయ్యే అన్ని పద్ధతుల్లో భవనాలు అందుబాటులోకి రానున్నాయి.

-ఏపూరి భాస్కర్‌రావు, ఈవో, యాదగిరిగుట్ట, దేవస్థానం

తెలంగాణలో చోరీ.. ఆంధ్రాలో విక్రయం

● అంతర్రాష్ట్ర ట్రాక్టర్ల దొంగల ముఠా అరెస్ట్ ● ట్రాక్టర్లు, ట్రాలీలు వ్యవసాయ పరికరాలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

త్రిపురారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సులువుగా డబ్బు సంపాదించాలని పొలాలవద్ద, జన సంచారం లేని ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన ట్రాక్టర్లు, ట్రాలీలు, వ్యవసాయ పరికరాలు ఎత్తుకెళుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రా మానికి చెందిన వేముల నాగరాజు, పాల్తీతండాకు చెందిన డేగావత్ బాబు నాయక్ వ్యవసాయం చేస్తున్నారు. బొర్రాయిపాలానికి చెందిన గద్దల రాజీవ్ ఆటోడ్రైవర్ కాగా, తిప్పర్తి మండలం రామారం గ్రామానికి చెందిన ఎరకల శివ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం మిర్యాలగూడ మండలం గూడూరులో నివా సం ఉంటున్నాడు. ఒకరిద్వారా ఒకరికి పరిచయం ఏర్పడిన ఈ నలుగురు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఏడాది జనవరి 7న త్రిపురారం మండలం బెజ్జికల్ శివారులోని పొలాల్లో ఉన్న వింజం ధనలక్ష్మికి చెందిన ట్రాక్టర్ ట్రాలీ, అదే మండలం డొంకతండా గ్రామపంచాయతీ పరిధిలోని కాన్యాతండాకు చెందిన ఇస్లావత్ శారద సంబంధించిన ట్రాక్టర్, ట్రాలీ, జనవరి మాసంలో నిడమనూరు మండలంలోని ధన్‌సింగ్ తండా వద్ద కోళ్లఫారం వద్ద ఉన్న ట్రాక్టర్, మార్చి 11న నీలాయిగూడెంలో మోదాల సత్యనారాయణకు చెందిన కల్టివేటర్, అదే నెల 25న మర్రి కనకయ్య, కచ్చిరెడ్డి సత్యనారాయణరెడ్డికి సంబంధించిన ట్రాక్టర్‌కు ఉపయోగించే కల్టివేటర్, గొర్రు, దమ్ము చక్రాలు దొంగిలించారు. ప్రధాన నిందితుడు నాగరాజు దాచేపల్లి మండలం పెద్దగార్లపాడులో 30ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుండగా, దొంగిలించిన సొత్తును రహస్యంగా ఆ ప్రాంతానికి తరలించారు. అవసరం మేరకు వాటిని విక్రయిస్తున్నామని అక్కడి వారిని నమ్మించి పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లో విక్రయించి వచ్చిన సొత్తును నలుగురు పంచుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం అంజనపల్లి గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు వేముల నాగరాజు(ఏ1) సొంత ట్రాక్టర్‌లో కల్టివేటర్, దమ్ము చక్రాలు, గొర్రు వేసుకుని వెళ్తున్నాడు. ట్రాక్టర్‌కు ముందు ఏ-2 డేగావత్ బాబునాయక్, ఏ-3 ఎరకల శివ, ఏ-4 గద్దల రాజీవ్ రెండు మోటార్ సైకిళ్లపై అడవిదేవులపల్లి వైపు వెళ్తుండగా అనుమానంతో వాహనాలు ఆపి విచారించటంతో చోరీల విషయం బహిర్గతమైంది. వీరి వద్ద రెండు ట్రాక్టర్లు, రెండు ట్రాలీలు, వ్యవసాయ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.10లక్షల పైబడి ఉంటుందని, నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, త్రిపురారం ఎస్ఐప్రసాద్, సిబ్బంది ఆర్, శ్రీనివాస్, చాంద్‌బాషా, ఎస్.శ్రీను, నర్సింహ, నవీన్‌రెడ్డి, రాము, రాంబాబు, మణిరత్నానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందనలు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చూపిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మద్యం మత్తులో
భార్య హత్య

● నల్లగొండ జిల్లా తెరాటిగూడెంలో ఘటన

గుర్రంపోడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య వివాదం హత్యకు దారితీసింది. సోమవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన దుప్పల్లికిరణ్ తెరాటిగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన అరుణను(40) 12ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. మండల కేంద్రంలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. నాలుగేళ్ల క్రితం తెరాటిగూడెంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కిరణ్ భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఇంట్లో ఉన్న కత్తితో మెడపై కోసి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో బయటకు వచ్చిన అరుణ ఇంటి బయట పడిపోవడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోగా అరుణ మృతి చెందింది. ఇన్‌చార్జి సీఐ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి సోదరుడి కుమారుడు కన్నెబోయిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు.

కాల్వలో స్నానానికి వెళ్లి గల్లంతు

● కొనసాగుతున్న సహాయక చర్యలు
● లభించని ఆచూకీ


అంజయ్య (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కాల్వలో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలంలోని సింగరాజుపల్లి గ్రామ శివారులోని పానగల్‌కు వెళ్లే ప్రధానకాల్వ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలకేంద్రానికి చెందిన వట్టేపు అంజయ్య (35) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామ శివారులో పానగల్ వెళ్లే ప్రధానకాల్వ వద్ద స్నానం చేసి వద్దామని వరుసకు బావ అయిన ఎల్లయ్యతో కలిసి వెళ్లాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. వెంటనే ఎల్లయ్య దూకి ఒడ్డుకు తీసుకువద్దామనుకునే లోపే గల్లంతయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి ప్రధాన కాల్వ గేట్లను మూసివేశారు. అయితే రాత్రి కావడంతో గాలింపు చర్యలు మందగించాయి. రాత్రి పొద్దుపోయే వరకు మృతదేహం లభ్యం కాలేదు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బొమ్మలరామారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కాజీపేట గ్రామ శివారులోని శామీర్‌పేట వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపేట గ్రామ సమీపంలోని శామీర్‌పేట వాగు కుంటలో చేపల వేట కోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదశాత్తు మృతి చెందాడని సమాచారం వచ్చినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేయగా మృతుడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుంది. మృతుడు దొంకెన కిష్టయ్య, వ్యవసాయ భూమి పక్కన గల శామీర్‌పేట వాగులో గల కుంటలో చేపలు పట్టడానికి దిగి ఈతరాక మునిగిపోయి చనిపోయినట్లుగా ఉందని పేర్కొన్నారు. మృతుడు నలుపు రంగు షర్ట్‌పై పెసర రంగు టీషర్ట్, నల్ల ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టీలు ఎక్కువగా ఉండడంతో మృతుడు ఒడిశా ప్రాంతానికి చెందిన కార్మికుడు అయి ఉంటాడని అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. ఎవరికైనా సమచారం తెలిస్తే తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

గుర్తు తెలియని వాహనం
ఢీకొని ఒకరు దుర్మరణం


కృష్ణయ్య (ఫైల్)

వేములపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... మండల కేంద్రానికి చెందిన పుట్టల కృష్ణయ్య (49) దళితకాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తు న్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే కృష్ణయ్య మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతునికి భార్య, జయలలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూర్‌నగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): భార్య భయపెట్టాలని మద్యం మత్తులో ఎలుకల మందు తాగిన ఓ వ్యక్తి చి కిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జి ల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.... హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన ఆలకుంట్ల భిక్షం (39) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 29 వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో భిక్షం మద్యం మత్తులో భార్యను భయపెట్టాలనే ఉద్దేశంతో ఎలుకల మం దు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భిక్షంను హు జూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తమ తండ్రి ఎ లాంటి మందు తాగలేదని కుమార్తె స్రవంతి భిక్షంను ఇంటికి తీసుకెళ్లింది. ఇంటికి వెళ్లిన తర్వాత భిక్షం వాంతులు చేసుకుంటుండగా వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచనల మే రకు మెరుగైన చికిత్స కోసం ఈనెల 30వ తేదీన సాయంత్రం ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృ తుడు భిక్షం పెద్ద కుమార్తె స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకం

● మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, పత్రికల విలువలను ప్రతిఒక్క రూ పెంచాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ సందర్భంగా ఆదివారం రాత్రి హుజూర్‌నగర్‌కు విచ్చేసిన ఆయనకు పట్టణంలో మంత్రి ఉత్తమ్ నివాసంలో ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జిల్లా కమిటీ ఆ ధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం ఎంతో పవిత్రమైందని, జర్నలిజంలో విలువలు కాపాడుకోవాలని అన్నారు. దేశంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ పోరాటాలు చేస్తోందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేయాలని ఆయన సూచించారు. సమాజంలోని రుగ్మతలు, అసమానతలపై పోరాటం చేయాలని, అణగారిన వర్గాలకు అండగా ఉండాలన్నారు. సమాజహితమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలు త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పత్రికలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని సీపీఐ నాయకులు గన్నా చంద్రశేఖర్, గుండు వెంకటేశ్వర్లు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే - ఐజే యూ జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, జర్నలిస్టులు దేవరం రామిరెడ్డి, శేషంరాజు, రావుల రాజు, అంజయ్య, రామకృష్ణ, వెంకటరెడ్డి, శ్రీనివాసచారి, కీత రామనాథం తదితరులు పాల్గొన్నారు.


మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు



నల్లగొండ డీఆర్‌డీఏ సమీపంలోని మహిళా సంక్షేమ భవన్ ప్రాంగణంలో విరగబూసిన పుష్పాలతో చెట్టు ఆకట్టుకుంటోంది. కొమ్మలకు ఆకులు లేకపోవడంతో దూరంగా చూసే వారికి పక్షుల్లా కనిపిస్తున్నాయి.



ఎండాకాలం ఎవరికైనా దాహం వేస్తుంటుంది. నల్లగొండలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు మట్టి కంచులతో ఏర్పాటు చేసిన నీటితొట్టి.



నల్లగొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని వివిధ రంగుల పుష్పాలతో చెట్లు ఆ దారిన వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. డీపీఆర్‌వో కార్యాలయం సమీపంలో నారింజ రంగులోని పుష్పాలతో కూడిన చెట్టు చూపుతిప్పేలా మలుపులో కనిపిస్తోంది.

భక్తజనసంద్రం యాదగిరి క్షేత్రం

● నిత్యాదాయం రూ.66.44లక్షలు



యాదగిరిగుట్టలోని క్యూకాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ, లక్ష్మీనృసింహులకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధి సోమవారం భక్తజనసంద్రంగా మారింది. రంజాన్ పర్వదినం సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో రావటంతో కొండపైన రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇదే విషయమై ఆలయ అధికారులు మైక్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. భక్తులు సంచరించాల్సిన ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాలు పార్కింగ్ చేయడంతో భక్తులు నడించేందుకు చోటు లేకుండాపోయింది. ప్రధాన కార్యాలయం పక్కన ఉన్న ఘాట్ రోడ్డులో యూటర్న్ వద్ద వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డులో యూటర్న్ వద్ద వాహనాలు అడ్డువచ్చినప్పుడు ఆగి బస్సులు ముందుకు కదలేకపోవడంతో భక్తులు దిగివెళ్లిపోయిన తర్వాత ముందుకు కదిలించారు. కొండకింద వాహనాల ప్రవేశ ద్వారం వద్ద వాహనాల రాక అధికమవడంతో బారులు తీరాయి. కాగా, సుమారు 53వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనులతో సందడి నెలకొంది. ప్రత్యేక దర్శనాలకు గంటన్నర, ధర్మదర్శనాలకు మూడు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.66,44,697 ఆదాయం(ఇందులో 11,22,572 అద్దె ఒప్పందాలకు సంబంధించినవి) సమకూరినట్లు ఆలయ ఈవోఏ. భాస్కర్‌రావు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం, అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

ఆలయంలో ఉద్యోగ విరమణ

గత 40ఏళ్లుగా యాదగిరిగుట్ట దేవస్థానంలో అటెండర్‌గా సేవలు అందించిన నాలుగో తరగతి ఉద్యోగి బరిగె సత్యనారాయణ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలులో శాలువా, స్వామివారి లడ్డు ప్రసాదంతో ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు ఘనంగా సన్మానించారు.

పెరిగిన టోల్ చార్జీలు

బీబీనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై టోల్ చార్జీలు పెరిగాయి. పెరిగిన చార్జిలు ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా ఒక్కటే ఉంది. ఈ టోల్‌ప్లాజా వద్ద పెరిగిన చార్జిల ప్రకారం కారు, జీపు , వ్యాన్లకు రెండు వైపుల కలిపి రూ. 5, ఎల్‌సీడీ వాహనాలకు రెండు వైపుల రూ. 10, బస్సు, ట్రక్కులకు రెండు వైపుల కలిపి రూ. 20, ఎంఏవీ వాహనాలకు రెండు వైపుల రూ. 25, ఓఎస్‌డీ వాహనాలకు రెండు వైపుల కలిపి రూ. 40చొప్పున పెరిగినట్లు టోల్‌ప్లాజా జీఎం తేజోనిధి తెలిపారు. పెరిగిన చార్జీలు వాహనాదారులకు అదనపు ఆర్థిక భారం కానున్నాయి.

ఉపాధి కూలీలకు తీపి కబురు



ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు

● *వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు*

భువనగిరి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు(ఉపశమనం) పంపింది. అన్ని రాష్ట్రాల్లోని కూలీల వేతనాలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జారి చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఇది వర్తించనుంది. ఏప్రిల్ 1నుంచి పెంచిన కూలీ వేతనాలు అమలులోకి రానున్నాయి.

రూ. 300 నుంచి 307కు

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికుల దినసరి కూలీ ధరలను రూ.300నుంచి రూ.307కు పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం రూ.7పెరిగింది. వ్యవసాయ కూలీల వలసలను నిరోధించడం, ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలన్న ఉద్దేశంతో 2005సంవత్సరంలో కేంద్రంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. గ్రామీణ కుటుంబాల జీవనోపాధి భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామీణ కుటుంబంలోని వయోజన సభ్యులు నైపుణ్యం లేని శారీరక శ్రమ చేయడానికి ముందుకు వచ్చేలా ఏడాది పొడవున ఒక్కొక్కరికి 100 రోజుల పని కల్పిస్తోంది.

జిల్లాలు	కూలీల సంఖ్య	జాబ్ కార్డుల సంఖ్య
యాదాద్రి భువనగిరి	2.63లక్షలు	1.43లక్షలు
నల్లగొండ	7.65లక్షలు	3.60లక్షలు
సూర్యాపేట	5.07లక్షలు	2.63లక్షలు
మొత్తం	15.35లక్షలు	7.66లక్షలు

ఉపాధి కూలీల్లో ఉత్సాహం..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి , నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో దాదాపు 7.55లక్షల జాబ్ కార్డులు కలిగి ఉండగా మొత్తం 15.35లక్షల కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్లు రికార్డులో నమోదు అయ్యారు. వీరంతా వేసవి కాలంలో ఎక్కువ పని దినాలు పూర్తి చేసి పెరిగిన కూలీ ధరలతో వీరికి ప్రయోజనం కలగనుంది. ఏప్రిల్ 1నుంచి ఉపాధి పనులకు వచ్చే కూలీలకు రోజుకు ఒకరికి గరిష్టంగా రూ. 307 వేతనాన్ని పొందవచ్చు. పదేళ్ల కిందట ఉన్న రోజు వారి కూలీ రూ.193కాగా ప్రస్తుతం రూ. 307కు చేరింది. పదేళ్లలో 62.86శాతం ధరను పెంచింది.

వడదెబ్బ బారిన పడకుండా..

వేసవిలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ప్రభుత్వం సులభమైన పనులను సూచిస్తుంది. పూడికతీతతో పాటు పొలాలకు మట్టి రహదారులు, ఫారమ్ ఫండ్‌లు, గట్టు కాల్వల నిర్మాణం, బర్రెలు, మేకల షెడ్లు వంటి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కూలీ డబ్బులు పెంచడంతో ఎక్కువ కష్టపడే వారికి కొలతల ఆధారంగా లెక్క కట్టి అందించనున్నారు.

ప్రభుత్వం జీవో జారీ చేసింది



ఉపాధి కూలీల వేతనాలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం జీవో జారి చేసిందని ఏప్రిల్ 1నుంచి పెంచిన కూలీలు అమలులోకి వస్తాయి. వడదెబ్బ బారిన పడకుండా ఉండడానికి ప్రభుత్వం సులభతరమైన పనులను గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. పని ప్రాంతాల్లో నీడ, మంచినీటి సౌకర్యం, అత్యవసర వైద్య సదుపాయం సంబంధించిన కిట్టు అందుబాటులో ఉంచాం.

-టి.నాగిరెడ్డి, డీఆర్‌డీవో యాదాద్రి భువనగిరి జిల్లా

అక్రమ వినియోగంతో ప్రాజెక్టుకు చేరని నీరు

● ఆందోళనలో రైతులు ● పట్టించుకోని అధికారులు

శాలిగౌరారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పల్లివాడ ఆనకట్ట నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరందించే ఫీడర్ ఛానల్‌లో కొంతమంది నీటిని అక్రమంగా తరలించుకుంటున్నారు. దీంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు సరిగా రావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫీడర్ ఛానల్‌లో అక్కడక్కడ గుర్రపు డెక్కలు అధికంగా ఉండి ప్రాజెక్టులోకి నీరు రానందున కొంతమంది రైతులు శ్రమదానంతో ఇటీవల తొలగించారు. అయితే కొంతమంది నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. 30కిలోమీటర్లు ఉన్న ఫీడర్ ఛానల్‌పై నీటిపారుదల అధికారుల ఆజామాయిషీ లేనందున రోజురోజుకు నీటి అక్రమ వినియోగం ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ఎక్కడ పడితే అక్కడ గండ్లు పెడుతున్నారని రైతులు అంటున్నారు. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోల్ సమీపంలో జాలకుంట వద్ద శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసి భూమిలోపల నుంచి పైపులైన్ వేసి కొంతమంది వందల ఎకరాల్లో చేపల చెరువులను విశాలంగా నిర్మిస్తున్నారు. కొంతమంది లిఫ్ట్ ద్వారా విద్యుత్ మోటార్లను అమర్చి నీటిని యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు అంటున్నారు. అమ్మనబోల్ సమీపంలోని దామెరచెరువు వద్ద కూడా ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసి నీటిని అక్రమంగా వినియోగిస్తున్నారు. దీంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు రావడంలేదని రైతులు తెలిపారు. నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్‌ను పరిశీలించి నీటిని అక్రమంగా వాడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, అక్రమంగా వేసిన పైపులైన్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పరిశీలించిన రైతు సంఘం నాయకులు

శాలిగౌరారం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఫీడర్ ఛానల్‌ను సోమవారం శాలిగౌరారం మండల రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, రైతు వేముల పర్వతాలు పరిశీలించారు. ఈ ఫీడర్ ఛానల్‌పై నిరంతరం పనిచేయడానికి ఒక వాచ్‌మెన్‌ను నియమించాలని వారు కోరారు.



అమ్మనబోలు జాలకుంట వద్ద శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్ దుస్థితి

నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టాలి



నీటి అక్రమ వినియోగంలో చివరి భూములకు నీరు అందడం లేదు. ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అ ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారిని నియమించాలి శాలిగౌరారం ప్రాజెక్టులో ఫీడర్ ఛానల్‌లో అక్రమంగా నీటిని తరలించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. శాలిగౌరారం ప్రాజెక్టుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి.

● సులుగూరు వెంకన్న

రీసైక్లింగ్ దందా ఆగేనా?

(5వపేజీ తరువాయి)

ఆ బియ్యాన్ని డీలర్లే కొనుగోలు చేస్తున్నారు. రేషన్ కోటా వచ్చిన వెంటనే వినియోగదారులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేసిన అనంతరం కిలోకి రూ.8చొప్పున, గరిష్టంగా రూ.10వరకు లబ్ధిదారులకు డీలర్లు చెల్లిస్తున్నా రు. ఇలా వినియోగదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని క్వింటాకు రూ.2800 నుంచి రూ.3వేల ధరకు డీలర్లు వ్యాపారులకు.... విక్రయిస్తున్నారు. రేషన్‌డీలర్లు, సివిల్‌సప్లయిస్ శాఖలో ఉండే ఉద్యోగులు, అధికారులు, ఎక్కడికక్కడ ఈదందాలో తమ వాటాలు పొందుతున్నారనే ఆరోపణలు బలం గా ఉన్నాయి.

రీసైక్లింగ్ ద్వారా మళ్లీ మిల్లులకు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు వినియోగించని దాదాపు 80శాతం బియ్యం తిరిగి అక్రమ వ్యాపారుల ద్వారా మద్యం కంపెనీలకు, విదేశాలకు కొంత భాగం వెళితే, దాదాపు సగానికిపైగా బియ్యం తిరిగి మిల్లులకు చేరి సంచులు మారి మళ్లీ రేషన్ బియ్యంగా ప్రభుత్వానికే అంటగడుతున్నారు. మిల్లులకు సీఎంఆర్ కోసం ఇచ్చే ధాన్యాన్ని మరాడించకుండా దాచుకునే మిల్లర్లు ఈ రేషన్ బియ్యాన్ని ఆ కోటాలో ప్రభుత్వానికి అంటగట్టి, ఇటు మిల్లింగ్ చార్జీలతో పాటు, కమీషన్లు పొందడమే కాకుండా, ధాన్యాన్ని తమఖాతాల్లో వేసుకొని మార్కెట్లలో ధర ఉన్నప్పుడు బియ్యంగా మార్చి భారీగా లాభాలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. స్వయంగా సీఎం, మంత్రులే ఈ రకమైన ఆరోపణలు గణాంకాలతో సహా వివరించడంతో ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ దందా పాతుకుపోయిన విషయాన్ని తెలియజేస్తోంది. మిల్లర్లతో రీసైక్లింగ్ కోసం కుమ్మక్కయిన డీలర్లు, వారికి వచ్చే కోటా బియ్యంలో కనీసం 40శాతం బియ్యం రేషన్‌దుకాణాలకు వెళ్లకుండా వీరు తమ మిల్లువద్దకు తరలించి, అక్కడ బస్తాలు మార్చుకొని మళ్లీ సీఎంఆర్ కోటా కింద(అదే మిల్లుకి కేటాయించిన కోటాతో పాటు, ఇతర మిల్లుల కోటాలోనూ ఈ బియ్యాన్నే అందించడం ద్వారా) ఈ బియ్యాన్ని ప్రభుత్వానికే అంటగడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బీస్నీరైస్‌మిల్లులను, పనిచేయని మిల్లులను, పాతటెక్నాలజీ గల మిల్లులను తమ ఆధీనంలో ఉంచుకుంటున్న ఈ అక్రమవ్యాపారులు ఆ మిల్లుల అడ్డాగా ఈ బియ్యాన్ని నిల్వచేస్తూ దందా సాగిస్తున్నారనే ఉదంతాలు పలుమార్లు వెలుగులోకి వచ్చాయి. గడచిన మార్చి నెలలోనూ చిట్యాల ప్రాంతంలో రెండుమిల్లుల్లో ఇలా నిల్వచేసిన రేషన్ బియ్యం పట్టుబడడం ఈ దందా కొనసాగుతున్న విషయాన్ని నిర్ధారిస్తోంది. ప్రతినెలా ఒక్క నల్లగొండ జిల్లాలోనే రేషన్‌బియ్యం అక్రమంగా తరలించే కేసులు కనీసం 15 నుంచి 20వరకు నమోదవుతుండడం, అందులో కనీ సం ఒకటి, రెండైనా అంతర్రాష్ట్ర ముఠాల ప్రమేయమున్న ఘటనలు నమోదవుతుండడం ఇక్కడి రేషన్‌బియ్యం బ్లాక్ దందాని స్పష్టం చేస్తోంది.

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29,28,549 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ప్రతి నెలా ఆరుకిలోల చొప్పున సమీప రేషన్ దుకాణాల నుంచి బియ్యం అందుతోంది. ప్రతినెలా దాదాపుగా 17,869 మెట్రిక్‌టన్నుల బియ్యం ఇప్పటివరకు రేషన్‌ద్వారా పంపిణీ అయ్యేది. ప్రభుత్వమే స్వయంగా ధ్రువీకరించిన మేరకు ఉమ్మడి జిల్లాలో ఈ బియ్యంలో ప్రతినెలా కనీసం ఏడువేలమెట్రిక్‌టన్నుల బియ్యం తిరిగి రీసైక్లింగ్ ద్వారా మళ్లీ ప్రభుత్వానికే వచ్చేదని స్పష్టమవుతోంది. మరో ఏడువేల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం బయటకు వెళ్లిందని తెలుస్తోంది. మొత్తంగా జిల్లాలో పంపిణీ అయిన దొడ్డు బియ్యం ద్వారా ప్రతినెలా ప్రభుత్వానికి దాదాపు రూ.42 కోట్ల నష్టం వాటిల్లితే, ఆమేరకు అక్రమవ్యాపారులు, దళారీలు లబ్ధిపొందారని గణాంకాలు చెబుతున్నాయి. సన్నబియ్యం పంపిణీతో ఈదందా ఆగుతుందనే అభిప్రాయం అధికారవర్గాలు, రాజకీయనేతల్లో నెలకొంది.

ఎంతమందికి ఎన్నిస్తారు?

(5వపేజీ తరువాయి)

చేయలేదు. దీంతో పథకం అమలుపై కార్యాచరణ ప్రణాళికను ఎలా చేయాలన్న అంశంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద అర్హులైన వారంతా కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. రుణాల మంజూరును బట్టి సబ్సిడీని నిర్ధారించనున్నారు.

రుణాలు మంజూరు సరే... లక్ష్యాలేవీ

'రాజీవ యువ వికాసం' పథకం కింద రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిబంధనలు ఖరారు చేస్తూ జిల్లా యంత్రాంగాలకు ఆదేశాలు జారీచేసింది. అయితే జిల్లాల్లో ఏయే కార్పొరేషన్ల కింద ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేయాలన్న అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుటుంబాలు చాలా వరకు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు గల కుటుంబాలను తప్పించినప్పటికీ, రుణాలు చాలామంది యువతకు ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో కార్పొరేషన్లకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతమందికి స్వయం ఉపాధి రుణాలు అందించాలన్న లక్ష్యాలను నిర్దేశించేవి. ఆ మేరకు మండలాల్లోని ఆయా బ్యాంకుల నుంచి అంగీకార పత్రం తీసుకొచ్చిన పక్షంలో రుణాలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన సబ్సిడీ నిధులు బ్యాంకులు, లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమయ్యేవి. అయితే ఈ పథకం కింద ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించలేదు. దీంతో ఎంతమందికి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేస్తారన్న అంశంపై యువతలో తీవ్రంగా చర్చ నడుస్తోంది.

గతానికి భిన్నంగా...

గతంలో యువతకు స్వయం ఉపాధి కల్పించి, వారి జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం పలు కార్పొరేషన్లు ఏర్పాటుచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కార్పొరేషన్ల ద్వారా బ్యాంకుల సహకారంతో గతంలో ప్రభుత్వాలు సబ్సిడీపై రుణాలు మంజూరు చేసేవి. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్నాళ్ల పాటు పలు కార్పొరేషన్ల ద్వారా బ్యాంకు సమ్మతితో రుణాలు మంజూరు చేసినప్పటికీ, బ్యాంకులు లబ్ధిదారులను ఇబ్బందుల పాలుచేస్తున్నాయని నేరుగా రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే గొర్రెల, మేకల పంపిణీ, చేపల సీడ్స్, తదితర సంక్షేమ పథకాలను అమలుచేసింది. అయితే కొన్నేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు నిలిచిపోయింది. దీంతో చాలామంది లబ్ధిదారులకు తీవ్రంగా అన్యాయం జరిగింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో అమలు చేస్తున్న ఈ పథకం పూర్తిస్థాయిలో కార్పొరేషన్ల పర్యవేక్షణలో కొనసాగనుంది. సంబంధిత కార్పొరేషన్ల అధికారులు బ్యాంకులతో సంప్రదించి యువతకు రుణాలు ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నారు. లబ్ధిదారులు ఏయే పథకం కింద దరఖాస్తుకున్నా పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా కలెక్టర్ సారథ్యంలో పలు శాఖలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటుచేసింది. అదేవిధంగా మండల స్థాయిల్లోనూ కమిటీల ఏర్పాటు చేసింది. ఈ పథకం అమలుపై జిల్లాయంత్రాంగం ఇప్పటికే ఆయా కార్పొరేషన్ల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక?

ప్రభుత్వం ఇటీవల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను చేపట్టింది. ఈ సర్వేలో ఏయే జిల్లాలో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు, ఇతరులు ఉన్నారన్న పూర్తి సమాచారాన్ని సేకరించింది. కులాల వారీగా జనాభాతో పాటు కుటుంబాలను వివరాలు కూడా నమోదుచేశారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 2,60,559 కుటుంబాలు ఉన్నట్టుగా గుర్తించారు. జిల్లాలో మొత్తం 17 మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో 2,15,011 కుటుంబాలు, భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కురు, యాదగిరిగుట్ట, ఆలేరు మునిసిపాలిటీల్లో 45,548 కుటుంబాలు ఉన్నట్టుగా తేల్చారు. అయితే కులాల వారీగా చేసిన గణన జిల్లా యంత్రాంగం వద్ద ఉంది. జిల్లాల్లో యువత చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, బ్యాంకుల నుంచి ఎంతమంది కాన్సెంట్ తీసుకొస్తారన్న అంశాన్ని బట్టి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్టు సమాచారం.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హత గల యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఈ పథకం కింద అర్హులైన యువత ఈ నెల 5వరకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లా స్థాయిలో కలెక్టర్ సారథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నాం. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాల్లో జిల్లా, మండల స్థాయిల్లో లబ్ధిదారుల ఎంపిక కమిటీలను ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.

-జే.శ్యాంసుందర్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

5 నుంచి 14 వరకు జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

నల్లగొండ, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం, బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణ విజయవంతం కోసం 2వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి షెడ్యూల్ కులాల సంఘాల ప్రతినిధులు హాజరై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

నేడు జీఎడవల్లిలో మంత్రి వెంకట్‌రెడ్డి పర్యటన

కనగల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామంలో మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించనున్నట్లు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తారని, అనంతరం రూ.4 కోట్ల నిధులతో గ్రామంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

వక్ఫ్ బోర్డు నిబంధనల సవరణపై నిరసన



ఈద్గా వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించాలనే ప్రయత్నానికి వ్యతిరేకంగా ముస్లింలు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనల సమయంలో నిరసలు వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించాలనే ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ముస్లిం నాయకులు నజీర్, సలీం, హషం, సత్తయ్య, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

మొర్సుగూడెం పురోహితుడికి ఉగాది పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగార్జున సత్యనారాయణశర్మ

చిట్యాలరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పరిధిలోని మొర్సుగూడెం పార్వతిరామలింగేశ్వరస్వామి దేవాలయం పురోహితుడు నాగార్జున సత్యనారాయణశర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా నల్లగొండలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సత్యనారాయణవర్మ ప్రశంసాపత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణశర్మ మాట్లాడుతూ తనకు పురస్కారాన్ని అందజేసిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై మరింత బాధ్యతను పెంచారని అన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ పురస్కార గ్రహీత పురుషోత్తమాచార్యులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, సాహితీ మేఖల సంస్థ అధ్యక్షుడు పున్న అంజయ్య, సాహితీ సంస్థ అధ్యక్షుడు పెందోట సోము తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలి



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎఫ్ఐ నాయకులు

గట్టుప్పల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. ఉగాది, రంజాన్ సందర్భంగా వెల్మకన్నె గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించే విధంగా బడ్జెట్‌లో తగిన నిధులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల అధ్యక్షుడు టేకుమట్ల కృష్ణ, ఉపాధ్యాక్షులు రావుల వెంకటేష్, తోటి వెంకన్న, క్రీడాకారులు మహేష్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యానికి సన్మానం



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న నాయకులు

మునుగోడురూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంను సోమవారం మండల పరిధిలోని ఎలగలగూడెంలో మండలానికి చెందిన మాజీ, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘం నాయకులు, అభిమానులు కలిసి ఆయన్ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కస్తాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం



కస్తాల గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చండూరు రూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండలంలోని కస్తాల గ్రామంలో జాతీయ సేవా పథకం శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పరిసరాలు, వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలను సోమవారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పచ్చదనం, పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా యాంటీ డ్రగ్ కార్యక్రమంపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ. శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గన్‌శ్యామ్, బాల సైదులు, వెంకన్న, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

మునుగోడురూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన ఆవులు సుగుణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబసభ్యులను బీజేపీ మండల నాయకుడు గోలి లింగస్వామి ఆమె మృతదేహానికి బీజేపీ నాయకుడు గోలి లింగస్వామి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులకరం సైదులు, మాజీ ఉపసర్పంచ్ అనిమల్ల నాగరాజు, ఆడెపు రవి, బాతరాజు గోవిందు, ఆవుల శ్రీనివాస్, ఆడెపు నాగరాజు, జుట్టు వెంకటయ్య, నక్కల నరేష్, అంతటి యాదయ్య పాల్గొన్నారు.

సన్నబియ్యంతో సంబురం



చిట్యాల మండలం ఎలికట్టెలో రేషన్ దుకాణానికి చేరిన సన్న బియ్యం, రేషన్ తీసుకుంటున్న మహిళ

» మండలవ్యాప్తంగా పంపిణీకి సన్నాలు సిద్ధం
» రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యం బస్తాలు

చిట్యాలరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలు అనగానే గుర్తుకొచ్చేది మొదటగా దొడ్డు బియ్యం. అయితే వాటిని కొనుగోలు చేసినప్పటికీనీ అధికశాతం ప్రజలు ఆ బియ్యంను తినకుండా బహిరంగ మార్కెట్‌లో అధికరేటుకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ప్రతి ఒక్కరూ నాణ్యమైన పౌష్టికాహారం తినాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి చేయాలని నిర్ణయం తీసుకుంది. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తే తాము ఆబియ్యాన్ని తింటామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి అంతా సిద్ధమైంది. ఉగాది పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకం సన్న బియ్యం పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. దీంతో ఏప్రిల్ మాసం నుంచి రేషన్ దుకాణాల్లో ఇకపై సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు.

మండలంలో రేషన్ కార్డులు..

చిట్యాల మండలం వ్యాప్తంగా మొత్తం 16347 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో సాధారణ రేషన్ కార్డు లబ్ధిదారులు 15337, అంత్యోదయ కార్డులు 1001,అన్నయోజన కార్డులు 9 కార్డులు ఉన్నాయి. మండలంలో రేషన్‌కార్డులబ్ధిదారులు మొత్తం 51141 మంది ఉన్నారు. అందులో సాధారణ రేషన్‌కార్డు లబ్ధిదారులు 48321, అంత్యోదయ లబ్ధిదారులు 2811, అన్నయోజన కార్డు లబ్ధిదారులు 9 మంది ఉన్నారు.

3250.51 క్వింటాళ్ల బియ్యం

మండల పరిధిలో గల రేషన్‌కార్డు లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం 3250.51 క్వింటాళ్లు అందజేయనున్నారు. అందులో సాధారణ రేషన్‌కార్డుదారులకు 2899.26 క్వింటాళ్లు. అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు 350.35 క్వింటాళ్లు. అన్నయోజన కార్డు లబ్ధిదారులకు 0.90 క్వింటాళ్లు పంపిణీ కానున్నాయి.

సన్నబియ్యం ఇస్తామంటే సంతోషమే



పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. ఇన్ని రోజులు దొడ్డు బియ్యం తిన్నాము. కూలీ పని చేసుకుని దుకాణాల్లో సన్నబియ్యం కొనుక్కుని తినాలంటే ఖర్చు భరించలేకపోతున్నాం. ఇకపై సన్న బియ్యం తీసుకుని వాటినే తింటాం. పేదలకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడమంటే సంతోషమే.

- మేడి సునీత, వనిపాకల, చిట్యాల

స్టాక్ వచ్చింది..



ప్రభుత్వం సన్నబియ్యం కోటాను ఈ నెల నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బియ్యం స్టాక్‌ను కూడా పంపించింది. రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తాం. మూడు రోజులుగా సన్న బియ్యం ఎప్పుడిస్తారని లబ్ధిదారులు వచ్చి అడిగి వెళ్తున్నారు. ప్రభుత్వం, అధికారుల నుంచి ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తామని చెబుతున్నాం.

- శ్రీనివాస్, రేషన్ డీలర్, వెలిమినేడు, చిట్యాల.

సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వం ఉగాది పండుగ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రకటించింది. ఈ మేరకు మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలకు సన్నబియ్యం స్టాక్ ఇప్పటికే చేరింది. ఆయా దుకాణాల్లో లబ్ధిదారులకు సంబంధిత డీలర్లు సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. కార్డుదారులలోని లబ్ధిదారులకు నిర్దేశించిన విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

- కృష్ణానాయక్, తహసీల్దార్, చిట్యాల

భక్తిశ్రద్ధలతో ఈదుల్‌ఫితర్ వేడుకలు

● సామూహికంగా ప్రార్థనలు చేసిన ముస్లింలు
● ఈద్గా వద్దకు హాజరైన మంత్రి కోమటిరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్



ముస్లిం నాయకులతో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండకల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వాతావరణ కొద్దిగా చల్లబడటంలో ప్రార్థనలను ఇబ్బంది లేకుండా సజావుగా చేశారు. జి ల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా వద్ద వేలాదిమంది ముస్లింలు సా మూహికంగా అల్లాను స్మరిస్తూ దువా చేశారు. ముస్లిం మత పెద్ద మౌలానా ఎహసానోద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలతో ప్రత్యేకంగా నమాజ్ చేయించారు. ఈద్గాకు అధి క సంఖ్యలో ముస్లింలు తరలిరావటంతో పండుగ వాతావరణంగా మారంది. పెద్ద లు, చిన్నారులతో కలిసి ముస్లింలు సంతోషంగా ఈద్గాలో సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎహసానుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు పేద ముస్లింలకు ఇంకా అందడంలేదని అన్నారు. అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శామియానాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, వివిధ పార్టీ లు, పలు సంఘాల నాయకులు హాజరై నమాజ్ అనంతరం ముస్లింలకు ఈద్ ము బారక్ తెలిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఐకమత్యాన్ని చాటారు. తదుప రి ముస్లింల పెద్దల సమాధుల వద్దకు వెళ్లి వారి ఆత్మలకు శాంతి కలగాలని సమాధులపై పూలు చల్లి ప్రార్థనలు చేశారు. స్తోమతకు తగినట్లుగా ముస్లింలు మసీదులకు, పేదలకు దానధర్మాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఏఎస్పీ రమే ష్, ఈద్గా కమిటీ చైర్మన్ డాక్టర్ హఫీజ్‌ఖాన్, వక్ఫ్‌బోర్డు ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఏఏఖాన్, షరీఫ్, జలీల్, ఖుషమా, బుర్హన్ షరీఫ్, ఇంతియాజ్ అలీ, చాంద్‌పాషా, రియాజ్, జునైద్ హష్మి, మోహితుల్లా, వివిధ పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్, అల్లి సుభాష్, భాస్కర్, సలీం, హషం, పాలడుగు నాగార్జున, కట్టెల శివకుమార్, గోగుల శ్రీనివాస్, దండంపల్లి సత్తయ్య, నజీర్ పాల్గొన్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

పండుగలకు పుట్టినిల్లు తెలంగాణ: భూపాల్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం పండుగలకు పుట్టినిల్లు అని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ముస్లిం పెద్దల నివాసాలకు మాజీ ఎమ్మెల్యే వెళ్లి అల్పాహార విందు స్వీకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ అతి పవిత్రమైనది దని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు నిరవంజన్‌వలీ, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, జమాల్ ఖాద్రి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గణేష్, మెరుగు గోపి, జాఫర్, మౌలానా బఖీర్, అన్వర్, అబ్రార్, సోహెల్, ఓవైసి, అన్సారీ, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలోని అన్ని మండలాల్లో ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల వద్దకు చేరిన ముస్లింలు సంప్రదాయ రీతిలో నమాజ్ నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● నకిరేకల్ శివారులోని ఈద్గా వద్ద సోమవారం రంజాన్ పర్వదిన వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆరు గ్యారెంటీల మెనిఫెస్టో సభ్యుడు చామల శ్రీనువాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ రజిత శ్రీనివాస్, కౌన్సిలర్ గాజుల సుకన్య, నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్‌లో నిర్వహించిన రంజాన్ ప్రార్థనల్లో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ పాల్గొని ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జి.రవీందర్‌రెడ్డి, బడుగుల నరేందర్, బి.రవీందర్ పాల్గొన్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో మత పెద్దలు జఫార్, యాకుబ్, యాసిన్, రజాక్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి మండలంలోని పస్నూర్, నాంపల్లి, తిరుమలగిరి, నెవిళ్లగూడెం, నేరళ్లపల్లి గ్రామాల్లో రంజాన్‌ను ఘనంగా నిర్వహించారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, ముత్తయ్య, శ్రీధర్, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కరీంపాష, మాజీ జడ్పీ కోఆప్షన్ జియావుద్దీన్, మండల కోఆప్షన్లు హఫీజుద్దీన్, మహ్మద్‌ఆలీ, అజీజ్, ఏఎంసీ డైరెక్టర్ కరీంముల్లా, సోయబ్, జునేద్, ఇబ్రహీం, జానీ, బాబా పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల, కట్టంగూరు, ఈదులూరు, బొల్లేపల్లి, పామనగుండ్ల, కల్మెర, నారెగూడెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్ర త్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దస్తగిరి, ఎండీ లతీఫ్‌ఖాన్, సయ్యద్ ఆలీ, ఉస్మాన్, రఫీ, రహీం, హమీద్, జానీపాష, జావీద్, ఇమ్రాన్, జానీపాషా, రవూఫ్, వినాయత్ ఆలీ, అజంఖాన్, గౌస్, రిజ్వాన్, ఫిరోజ్, అంజత్ పాల్గొన్నారు.



ముస్లిం పెద్దల నివాసాల్లో అల్పాహారం స్వీకరించి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

కొనుగోలు ప్రారంభయ్యేదెప్పుడు?



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

● ఇబ్బందులు పడుతున్న రైతులు
● శాలిగౌరారం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

శాలిగౌరారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో వరి కోతలు ప్రారంభమై వారం రోజులు కావొస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నేరుగా మిల్లర్లకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు వరి కోత మిషన్‌తో కోసిన ధాన్యాన్ని డైరెక్ట్ శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్ అంతా ధాన్యంతో నిండిపోయింది. ఎక్కడ చూసినా ధాన్యం రాశులతో నిండిపోయింది. కొంతమంది రైతులు ధాన్యం ఆరపోశారు.

మండలంలో వ్యవసాయ బావుల, బోర్ల కింద దాదాపు 10వేల ఎకరాల్లో, శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు కింద 5వేల ఎకరాలు సేద్యం చేశారు. గత సీజన్‌లో 10 ఐకేపీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరమైన అధికారులు ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులతో నిండిపోయింది. నేను వారం రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చి ఆరబోశాను. ధాన్యాన్ని కోతుల గుంపు వచ్చి ఆగం చేస్తున్నాయి. అకాల వర్షం పడితే ధాన్యం తడిసే అవకాశం ఉంది. అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

● తోటకూరి మధుబాబు, రైతు, శాలిగౌరారం

కొనుగోళ్లను ప్రారంభిస్తాం



శాలిగౌరారం మార్కెట్‌కు ధాన్యం ఉప్పెనలా వచ్చి చేరింది. ఇప్పటికే చాలా మంది రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో ఆరబోసుకున్నారు. ఉగాది పండుగ తర్వాత ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తాం.

● ఛీనానాయక్, మార్కెట్ కార్యదర్శి, శాలిగౌరారం

హామీలను అమలుచేయాలి



పుల్లెంల గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ నాయకులు

చండూరురూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ అంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పుల్లెంల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు చేయూత పథకం ద్వారా ప్రతి నెలా రూ.2 నుంచి 4 వేలు ఇస్తామని, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి గృహిణికి ప్రతీ నెలా రూ.2500 అందజేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల హామీల అమలు ఒత్తిడి చేసేందుకు బీజేపీ పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ పథకాల కోసం మండలంలో దరఖాస్తుదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కోకన్వీనర్ కాసాల జనార్థన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొబ్బల మురళీమనోహర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, నాయకులు జెట్టి యాదయ్య, పాలకూరి దశరథ, పోలే సురేష్, నాయకులు బొబ్బల జనార్థన్‌రెడ్డి, ఇరిగి శివ, నకిరేకంటి రఘు, మహేందర్ రెడ్డి, శ్రీశైలం, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మునుగోడు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనసభలో చేసిన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలనే డిమాండ్‌తో డిల్లీల్లో ఏప్రిల్ 2వ తేదీన చేపట్టబోయే ధర్నాకు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి డిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్రప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	230
సూర్యాపేట	రూ.140	200	230
నల్లగొండ	రూ.140	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 | కనిష్ఠం 23.2

● భక్తి ప్రపత్తులతో రంజాన్

నల్లగొండలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధల మధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాల వద్ద సందడి కనిపించింది. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రముఖులు ఈద్గాల వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. 8

యాదాద్రి క్షేత్రం భక్తజన సందోహం ●



వరుసగా సెలవులు రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. దీనికి తోడు ఉగాది పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో స్వామి వారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ క్రమంలో కొండపైన ఎక్కడ చూసినా భక్తజన సందోహం కనిపించింది. దర్శన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. 7



ఎంతమందికి... ఎన్నిస్తారు?

లక్ష్యాలను నిర్దేశించని రాష్ట్ర ప్రభుత్వం

రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులకు ఆహ్వానం

కార్పొరేషన్ల ద్వారా పథకం అమలు ▸▸ బ్యాంక్ కాన్సెంట్ పత్రం తప్పనిసరి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను బలోపేతం చేస్తూ, వాటి ద్వారానే యువతకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని కార్పొరేషన్ల ఆధ్వర్యంలోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. మార్చి 17 తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా పలు యూనిట్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ఎంతమందికి రుణ సదుపాయం కల్పిస్తారన్న లక్ష్యాలను ఇంకా వెల్లడించలేదు. దీంతో దరఖాస్తుదారుల్లో ఎంతమందికి ఈ రుణసదుపాయం కలుగనుందోనని సందిగ్ధంగా ఉంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

'రాజీవ్ యువ వికాసం' పథకంలో రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ పథకం కింద యువత పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఏయే కార్పొరేషన్ల కింద ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నది ప్రభుత్వం స్పష్టం...

- మిగతా 7వ పేజీలో...



రీసైక్లింగ్ దందా ఆగేనా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేళ్లూనుకున్న రేషన్ బియ్యం అక్రమదందాకు చెక్‌పడనుందా?, సన్నబియ్యం పంపిణీ పథకం మిల్లర్లు, రేషన్ డీలర్లు, అక్రమ వ్యాపారులకు పచ్చి వెలక్కాయ కానుందా అంటే సివిల్ సప్లయ్ అధికారులు అవుననే అంటున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. ఎంత చెప్పినా మిల్లర్లు వినడం లేదని, గత ప్రభుత్వం చేసిన తప్పులను దిద్దుతూ అక్రమదందాకు చెక్‌పెడుతున్నట్లుగా చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక రేషన్ రీసైక్లింగ్‌కు చెక్‌పడినట్లుగా భావిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



- ▸▸ సీఎం ఘాటు వ్యాఖ్యలతో కలకలం
- ▸▸ ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యంతో ప్రతినెలా దాదాపు రూ.42 కోట్ల దందా
- ▸▸ సన్నబియ్యంతో పంపిణీతోనైనా అడ్డుపడుతుందని ఆశాభావం

బహిరంగ సభలోనే ఏకంగా ముఖ్యమంత్రి స్వయంగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ దందా నియంత్రించలేని స్థితికి వెళ్లిందని పేర్కొనడం ఉమ్మడి జిల్లాలో కేంద్రీకృతమైన మాఫియా తీరుని తెలియజేస్తోంది. సన్నబియ్యం పంపిణీతోనైనా ఈ రేషన్‌బియ్యం రీసైక్లింగ్ దందాకి తెరపడుతుందనే ఆశాభావాన్ని సీఎంతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు బహిరంగంగానే పేర్కొనడం జిల్లాలో వేళ్లూనుకుపోయిన రేషన్‌బియ్యం అక్రమదందా తీరుని తెలియజేస్తోంది.

"గత ప్రభుత్వం రాష్ట్రంలోని రైస్‌మిల్లుల వద్ద 21 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం దాచిపెట్టింది. మా ప్రభుత్వం ఏర్పాటయ్యాక మిల్లర్ల సమావేశం పెట్టి ఆ ధాన్యమైనా ఇవ్వండి లేదంటే డబ్బులైనా ఇవ్వండి అంటే పైసలూ కట్టడం లేదు. ధాన్యమూ ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మూడుకోట్ల మందికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే, వారి నుంచి ఆ బియ్యాన్ని కిలో రూ.10కే మళ్లీ మిల్లర్లు కొంటున్నారు. వాళ్ల అవే బియ్యాన్ని మళ్లీ ప్రభుత్వానికి రూ.30కి అమ్ముతున్నారు. సీఎంగా, మంత్రులుగా ఈ సైక్లింగ్ వ్యవహారమంతా చూశాం. ఏడువేల మెట్రిక్‌టన్నుల ధాన్యానికి వేలం వేస్తే, మూడువేల మెట్రిక్ టన్నుల ధాన్యమే వచ్చింది. ఇంకా నాలుగువేల టన్నుల ధాన్యం రాలేదు. మిల్లర్లు సహకరించడం లేదు. దొడ్డుబియ్యం పంపిణీకి ఖర్చుచేస్తున్న దాదాపు రూ.10వేల కోట్ల ప్రజాధనం దళారీలు, మాఫియాకు ఉపయోగపడిందే తప్ప, ప్రజలకు వాటితో ఉపయోగంలేదు. అందుకే తమ ప్రభుత్వం దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం ఇస్తున్నాం." ఇవి స్వయంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి రేషన్‌బియ్యం రీసైక్లింగ్‌పై హుజూర్‌నగర్ సభలో సీఎం చేసిన వ్యాఖ్యలివి.



డీలర్లు, అక్రమవ్యాపారులు కలిసి రేషన్ బియ్యం సేకరణ..

నల్లగొండ జిల్లాలో రేషన్ బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరించి ఆ బియ్యాన్ని లారీల్లో పొరుగు రాష్ట్రాల్లోని పోర్టులకు, మద్యం కంపెనీలకు విక్రయించే మాఫియా జిల్లాలో వేళ్లూనుకుపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌డీలర్లు, అక్రమవ్యాపారులు, కొందరు రైస్‌మిల్లర్లు ఈ మాఫియాతో చేతులు కలిపి ప్రతినెలా పెద్దసంఖ్యలో రేషన్ బియ్యాన్ని దొడ్డిదారిలో విక్రయిస్తున్నారు. సివిల్‌సప్లయిశాఖ అధికారులకు ఈ దందాపై అవగాహన ఉన్నప్పటికీ నామమాత్ర పు తనిఖీలు, కేసులతో సరిపుచ్చుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో నియంత్రించలేని దుస్థితి కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో రేషన్ దుకాణాల డీలర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇష్టపడని వారికి డబ్బులు లేదంటే ఇతర వస్తువులను ఇచ్చి...

- మిగతా 7వ పేజీలో...

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి):మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద మైనార్టీలకు అందేలా చూస్తామన్నారు. పేద ముస్లింలకు ఇళ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్లు లేనివారికి ప్లాట్లు ఇచ్చి రూ.ఐదు లక్షలతో ఇల్లు కట్టిస్తామన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతో సుఖంగా ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించాలని చూస్తోందని విమర్శించారు. దేశఐక్యత కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ ,మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఆర్‌యూవీకి దరఖాస్తుల గడువు పొడిగింపు

నల్లగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం(ఆర్‌యూవీ) కింద స్వయం ఉపాధి పొందేందుకు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలి సి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రజా సేవ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయంలోని ప్రజాసేవకేంద్రాల్లో మ్యానువల్‌గా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 22,356 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించామన్నారు. అందులో నల్లగొండ, మిర్యాలగూడ నుంచి ఎక్కువగా దరఖాస్తు లు వచ్చాయన్నారు. ఈ నెల 14లోగా దరఖాస్తులు చేసుకునేలా అన్ని మండలాలు, మునిసిపల్ కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తామని, అదేవిధంగా దంకు వేయిస్తామన్నారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో 18004251442 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈనెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోవచ్చని పథకం అమలుకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. కార్యక్రమంలో అదనపు జేసీ జే శ్రీనివాస్, జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ రాజేశేఖర్‌రెడ్డి, గృహనిర్మాణ పీడీ రాజ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి,అధికారులు

వేద పాఠశాలకు స్థలం అప్పగింత

- ▸▸ ఈవోకు భూమిపత్రాలు అందజేసిన చీఫ్ ప్లానింగ్ అధికారి
- ▸▸ వైటీడీఏ పరిధిలోని 15 ఎకరాలు కేటాయింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వేద పాఠశాలకు మార్గం సుగమమైంది. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సుముఖత వ్యక్తం చేయగా, తాజా వైటీడీఏ పరిధిలోని 15 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం వైటీడీఏ చీఫ్ ప్లానింగ్ అధికారి అశ్వినియాదవ్ భూమి పత్రాలను ఈవో భాస్కర్ రావుకు అందజేశారు. అయితే వేదపాఠశాలతో పాటు సంస్కృత పాఠశాలను కూడా అక్కడికే తరలించనున్నారు. దీంతో ప్రశాంత వాతావరణంలో బాలురు వేదభ్యాసం చేయనున్నారు.ఇందుకోసం సుమారు రూ.23.79కోట్లను వెచ్చించనున్నారు.

- వివరాలు 6లో

ఒక్క రోజులో 110 రిజిస్ట్రేషన్లు

- ▸▸ చివరి రోజున ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు
- ▸▸ పండుగ సెలవు ఉన్నా పనిచేసిన ఎస్‌ఆర్ కార్యాలయాలు
- ▸▸ ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1,528 డాక్యుమెంట్లు నమోదు

నల్లగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) అమలులో భాగంగా ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సోమవారం ఒక్కరోజే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 110 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. రంజాన్ పండుగ సెలవుదినం అయినప్పటికీ సెలవును రద్దు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నడిచేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించడమే కాకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కూడా ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రమబద్ధీకరణ ఫీజులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాయితీ వర్తించేలా ఆదేశాలు ఇచ్చింది.

దీంతో మార్చి 31న సెలవు దినం అయినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కావడంతో సెలవు దినాన్ని పనిదినంగా మార్చి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు హాజరు కావాలని ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. అదేవిధంగా బ్యాంకులు కూడా పనిచేశాయి.

ఒక్క నకిరేకల్‌లోనే 48..



మొత్తం 15సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం 110 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. నకిరేకల్ పరిధిలోనే ఎక్కువగా 48 ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి. మోత్కూరు, చండూరు, చండూరు, దేవరకొండ, నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవకాశం కల్పించినప్పటికీ ఎటువంటి రిజిస్ట్రేషన్లు నమోదు కాలేదు. భువనగిరి కార్యాలయంలో 8, బీబీనగర్‌లో 8, చౌటుప్పల్ 5, రామన్నపేటలో 6, యాదగిరిగుట్టలో 8 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొత్తంగా ఈ జిల్లాలో 35 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కు నోచుకోగా, నల్లగొండ జిల్లాలో నకిరేకల్‌లో 48, నిడమూరులో 4 మొత్తంగా 52, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడలలో ఒక్కొక్కటి చొప్పున, సూర్యాపేటలో 21 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొత్తంగా ఈ జిల్లాలో 23 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నారు.

ఇప్పటి వరకు1,528 రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం ప్రారంభమైన నాటి నుంచి సోమవారంవరకు 1,528 దరఖాస్తులు రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

కార్యాలయం	డాక్యుమెంట్లు
యాదాద్రి జిల్లాలో...	
బీబీనగర్	140
చౌటుప్పల్	30
మోత్కూరు	30
రామన్నపేట	44
యాదగిరిగుట్ట	233
నల్లగొండ జిల్లాలో..	
చండూరు	23
దేవరకొండ	72
మిర్యాలగూడ	81
నల్లగొండలో	68
నకిరేకల్	113
నిడమూరు	85
సూర్యాపేట జిల్లాలో...	
హుజూర్‌నగర్	27
కోదాడ	160
సూర్యాపేట	270

ఉపాధి కూలీలకు తీపికబురు

- ▸▸ పెరిగిన కూలి రేట్లు
- ▸▸ రోజుకు రూ.300 నుంచి రూ.307
- ▸▸ ఉమ్మడి జిల్లాలోని 15.35 లక్షల మంది కూలీలకు లబ్ధి

కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు తీపికబురు చెప్పింది. కూలి రేట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రోజు వారీ కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచింది. గతేడాది పోలిస్తే రూ.7లు పెరిగింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15.35 లక్షల కూలీలకు లబ్ధిచేకూరనుంది. నేటి నుంచి పనుల్లోకి వచ్చే వారికి ఈ రేట్లు వర్తించనున్నాయి. పదేళ్లలో 62.86శాతం కూలి రేట్లను కేంద్రం పెంచింది.

- వివరాలు 7లో

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● మంగళవారం 1 ఏప్రిల్ 2025

మునిసిపల్ బడ్జెట్ ఆమోదం

మిర్యాలగూడ టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ బడ్జెట్‌కు ప్రత్యేకాధికారి ఆమోద ముద్ర పడింది. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి రూ.77.06 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు స్పెషలాఫీసర్ వద్ద గ్రీన్ సిగ్నల్ లభించింది. పాలకవర్గ పదవీ కాలం జనవరిలో ముగిసింది. దీంతో అధికారులుబడ్జెట్ రూపొందించి ప్రత్యేకాధికారి వద్దకు పంపగా పరిశీలించిన అనంతరం ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

చింతపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. చింతపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంజూరు చేసే విషయంలో నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకంగా కేటాయించాలన్నారు. ఆయన వెంటబాదేపల్లి నిరంజన్ గౌడ్, గడ్డం శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేలా..



సోలార్ బోర్‌వెల్ నీటితో సాసర్ పిట్స్‌లో నీటిని నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్):
వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 14.25 లక్షల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణం ఉండగా అందులో 41 వేల హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో నాగార్జునసాగర్ డివిజన్‌లో 27,675 హెక్టార్ల విస్తీర్ణంలో వన్యప్రాణి సంరక్షణ విభాగం ఉంది. ఇం దులో మనుబోతులు, జింకలు, నెమళ్లు, రేసు కుక్కలు, కుందేళ్లు, అడవి పందులు, దుప్పులు వంటి జంతువులు ఉన్నాయి. వీటి దాహార్తిని తీర్చేందుకు వానాకాలం మొదలైనప్పటి నుంచి (జూన్ నెల ప్రారంభం నుంచి) అప్పుడు కురిసే వర్షాలతో అడవిలో ఏర్పాటు చేసిన చెక్ డ్యామ్‌లు, సాసర్ పిట్స్‌ల్లో నీరు ఉం టుంది. ఆ నీటితో జంతువులు తమ దాహార్తిని తీర్చుకుంటాయి. జనవరి చివరి వరకు అడవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉం డవని అటవీ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నెల నుంచి ఎండలు ఎక్కువ కావడంతో సాసర్ పిట్లల్లో, చెక్ డ్యామ్‌ల్లో ఉన్న నీరంత ఆవిరి అవుతోంది. దీంతో వన్యప్రాణులు దాహార్తిని తీర్చేందుకు అధికారులు అటవీలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.



ట్యాంకర్‌తో నీటిని నింపుతున్న సిబ్బంది

సాగర్ అటవీ రేంజ్‌లో 33 సాసర్ పిట్స్

నాగార్జునసాగర్ అటవీ విభాగంలో సాగర్ అటవీ రేంజ్‌లో వన్యప్రాణులు దాహార్తిని తీర్చేందుకు నాగార్జునపేట తండా వద్ద 5, శివం హోటల్ వెనుక వైపున 13, సమ్మక్క-సారక్క ఆలయం వద్ద 15 సాసర్ పిట్స్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 33 సాసర్ పిట్స్‌లతో పాటు సోలార్ బోర్‌వెల్స్ 4 ఉన్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సాసర్ పిట్స్‌ల్లో ఫిబ్రవరి ప్రారంభం నుంచి మే చివరి వరకు ట్యాకర్లతో నీటిని నింపుతున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఒక్క ట్యాంకర్‌కు సుమారు వెయ్యి నుంచి రూ. 1500 వరకు ఖర్చు అవుతుందన్నారు.

ట్యాంకర్లతో సాసర్ పిట్స్ నీటిని నింపుతున్నాం



సాగర్ అటవీశాఖ రేంజ్‌లో వేసవిలో వన్యప్రాణులు దాహార్తిని తీర్చేందుకు సాస ర్ పిట్స్‌ల్లో ట్యాంకర్లతో నీటిని నింపుతున్నాం. సాగర్ రేంజ్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం త్వరలో సీసీ (ట్రాప్) కెమెరాలను ఏర్పాటు చేస్తాం.

- రాఘవేంద్రరావు, సాగర్ అటవీ శాఖ రేంజర్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ● ఘనంగా ఈద్- ఉల్- ఫితర్ ● దేవరకొండ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్



మిర్యాలగూడ పట్టణంలో ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



దేవరకొండలో ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : ఈద్- ఉల్ -ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలు సోమవారం ఘనంగా ముస్లింలు జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష పాటించిన ముస్లింలు రంజాన్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ, అవంతీపు రం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లో కలిసి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ 30 రోజులు ఉపవాస దీక్షల వల్ల క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన అలవడతాయని అన్నారు. 'రంజాన్ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. బీఆర్ ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ పలు ఈద్గాల వద్ద నమాజులో పాల్గొనే ముస్లిం ప్రజలకు తాగునీరు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణు గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తల కొప్పు ల సైదులు, సలీం, ఇమ్రాన్ పాల్గొన్నారు.



ఈద్గా వద్ద తాగునీరు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ

దేవరకొండ పట్టణ శివారు డిండి రోడ్డులోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సీపీఐ నాయకులు పల్లా నర్సింహ రెడ్డి, ఎంఏ. సిరాజ్‌ఖాన్, రహత్‌అలీ, హనుమంతు వెంకటేష్ గౌడ్, శ్రీశైలం, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు యూనుస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, ముస్లిం మతపెద్దలు అజీమోద్దిన్, నజీర్‌అహ్మద్, బురానొద్దిన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

చింతపల్లి మం డలకేంద్రంతో పాటు వెంకటేశ్వరనగర్, వింజ మూర్, తక్కళ్లపల్లిలో ఈద్గాల వద్ద ముస్లిం లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వేములపల్లి మం డలంలోని పలు ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యే క ప్రార్థనలు నిర్వహించారు. కేంద్రం తీసుకొస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును నిరసిస్తూ నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కొండమల్లేపల్లిలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రం జాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మిర్యాలగూడలో చేతికి నల్ల రిబ్బన్ కట్టుకుని నవాజ్‌లో పాల్గొన్న ముస్లింలు



కొండమల్లేపల్లిలో ..

నేటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

పెద్దఅడిశర్లపల్లి,మార్చి31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మహేశ్వరం శివయ్యచారి వారు మా ట్లా డారు. మొదటి రోజు ఉప న్యాసం, శ్రీమద్రామాయణం భజన, రెండోరోజు ఉప న్యాసం, మహాభారత భజన, మూడోరోజు ఉపన్యాసం, శ్రీమద్భగవద్గీత భజన ఉంటాయని తెలిపారు. చివరి రోజున ఆలయంలో సామూహిక కుంకుమ పూజ ఉంటుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి



ఢిల్లీకి వెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. దేశవ్యాప్తంగా జనగణలో కులగణన చేపట్టాలని కోరుతూ ఈనెల 2న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జరిగే పోరుగర్జనకు చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రైలులో బయలుదేరినట్లు తెలి పారు. స్థానిక సంస్థల్లో విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పి ంచాలని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లును యధావిధిగా పార్లమెంటులో ఆమోదించి చట్టం చేయాలని అన్నారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో నాయకులు బంటు వెంక టేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, గుండెబోయిన నాగేశ్వరరావు, జ్వాలా వెంకటేశ్వర్లు, ఎస్పీ నాయుడు, చేగొండి మురళీ యాదవ్, నక్క నాగరాజు, కవిత, యాదగిరి, శ్రీను, చిలుకూరి రాజేష్, హరితేజ, కృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నలుపు రిబ్బన్లతో నిరసన



వేములపల్లి ఈద్గా వద్ద నల్ల రిబ్బన్లు ధరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మిర్యాలగూడ, వేములపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతి రేకంగా మండలంలోని అవంతీపురం ఈద్గాల వద్ద ముస్లింలు నల్ల రిబ్బన్లు చేతికి కట్టుకుని నమాజ్ చేసి నిరసన తెలిపారు. ఆయా ఈద్గాలలో నమాజ్ చేయించిన ముఫ్తీ రియాజ్, ముఫ్తీ ఇమ్రాన్, మౌలానా, ఎండీ వలీయుల్లా, మౌలానా మ గ్దుం, హఫీజ్ అక్బర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దురుద్దేశ పూర్వకంగా, వక్ఫ్‌ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనే దురాలోచనను తిప్పి కొట్టేం దుకు ఆలిండియా పర్సనల్ లా బోర్డు, జమైతే ఉలే మాయే హింద్ పిలుపు మేరకు నిరసన తెలుపుతున్న చెప్పారు. జమైతే ఆవామ్ అధ్యక్షుడు ఎంఏ. సమీఖాద్రీ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాలని కోరారు.

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND

ప్రత్యామ్నాయం చూపండి



గిరాకీ లేక వరుసగా పెట్టిన ఆటోలు

(ఆంధ్రజ్యోతి పెద్దఅడిశర్లపల్లి)
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారం భించిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమైతే.. విద్యార్థులకు ఆటో డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో విపరీతంగా రద్దీ పెరిగింది. ఈ క్రమంలో పాఠశాలలు, కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. వివిధ కంపెనీల్లో విధులు నిర్వర్తించే వారు సైతం సమయానికి చేరుకోలేకపోతున్నారు. అంతేకాకుండా చాలా మంది డ్రైవర్లు ఫైనాన్స్ తెచ్చి ఆటో నడుపుతున్నారు. ఈ పథకం అమలులోకి రావడంతో గిరాకీ అంతంత మాత్రమే ఉంటుందని వాపోతున్నారు. బడి పిల్లలను తీసుకెళ్తడడంతో వాళ్లిచ్చే డబ్బులతో ఇల్లు గడుస్తోందంటున్నారు. ఇక వేసవి సెలవులు వస్తున్నాయి. ఇక ఆ గిరాకీ కూడా ఉండదు. ఎట్లా బతకాలో అర్థం కావడంలేదని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు


● దేవరకొండలో ఐదుగురు ఇంటి యజమానులకు నోటీసులు



దేవరకొండ మునిసిపల్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ):
దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. దాదాపుగా 50 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మునిసిపాలిటీలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతే కాకుండా టౌన్‌ప్లానింగ్ అధికారి ఇటీవల బదిలీ కావడంతో ఆపోస్టు ఖా ళీగా ఉంది. టౌన్‌ప్లానింగ్ సహాయ అధికారి పోస్టు కూడ ఖాళీగా ఉంది. దీంతో ఆ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో అక్రమ నిర్మాణాలు జరుగు తున్న పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. కాగాదేవరకొండలో ఐదు ఇళ్ల యజమానులు అనుమతులులేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతుండడంతో నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలుపుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుపుతుండడంతో మునిసిపాలిటీకి వచ్చే ఆదాయం గండిపడుతుంది.

ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయించాం



మునిసిపాలిటీ అనుమతులు లేకుండా ఐదుగురు యజమానులకు నోటీసులు జారీ చేసి ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేశాం. అనుమతులు తీసుకొని ఇళ్ల నిర్మాణం జరుపుకోవాలి. టౌన్ ప్లానింగ్ అధికారుల పోస్టులు ఖాళీలుగా ఉన్నాయని ఉన్నతాధికారులకు విన్నవించాం. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకుంటున్నాం.

-సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో ..!

● మాల్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ● తరచూ ట్రాఫిక్ సమస్య

చింతపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, రంగారెడ్డి రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్‌తో పాటు మండల కేంద్రంలో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధానంగా సాగర్-హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు యాచారం, మర్రిగూడ, చింతపల్లి, నాంపల్లి మండలాల్లోని గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వెంకటేశ్వరనగర్‌కు వస్తుంటారు. వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు పలు పనుల కోసం ప్రజలు తమ రాకపోకలు నిర్వహిస్తుంటారు. ప్రతి సోమవారం చింతపల్లిలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీంతో పాటు రెండు జిల్లాల కూడలి ప్రముఖ విద్యావ్యాపార కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందిన వెంకటేశ్వరనగర్(మాల్) పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ప్రధానంగా మర్రిగూడ చౌరస్తా, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.



చింతపల్లిలో రోడ్డుపైనే చిరువ్యాపారులు విక్రయాలు



వెంకటేశ్వరనగర్‌లోని సాగర్-హైవేపై నిలిపిన వాహనాలు.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత

చింతపల్లి మండల కేంద్రానికి వెళ్లే దారిలో చిరువ్యాపారస్థులకు సరిపడా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితి కలిగింది. దీంతో పాటు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వ్యాపార సముదాయాలకు వెళ్లే వినియోగదారులు కూడా సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో తమ వాహనాలను రహదారిపైనే నిలపుతున్నారు. వాహనాలు ఎక్కడబడితే అక్కడ ఇష్టారాజ్యంగా నిలిపి వేస్తుండటంతో ముఖ్యంగా వ్యాపార సముదాయాలు కూరగాయల దుకాణాల వద్ద రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ట్రాఫిక్ నిబంధనలు వాహనాల పార్కింగ్‌పై పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా ఎలాంటి మార్పు రావడం లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, పోలీసులు చొరవ తీసుకొని ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేకమైన సమావేశాలు ఏర్పాటు చేస్తే కొంతమేరకు సమస్య తీరే అవకాశం ఉంటుంది. దీంతో పాటు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య కలుగుతుంది. పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంతో పాటు వెంకటేశ్వ రనగర్(మాల్)లో పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. వ్యాపార, వాణిజ్య దుకాణాల వద్ద కనీసం పార్కింగ్ లేదు. సాగర్-హైవేపై వాహనాల రద్దీ రోజురోజుకు మరింత పెరిగిపోతుంది.

-సందపట్ల రాజేష్ సాగర్, వీ.టీ.నగర్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డుపై నిలిపితే కేసులు నమోదు చేస్తాం. మాల్ జాతీయ రహదారి కావడంతో రద్దీ అధికంగా ఉంటుంది. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. చిరువ్యాపారులు రోడ్డుపై వ్యాపారం చేయకుండా చర్యలు తీసుకుంటాం.

-భీమనమోని యాదయ్య, ఎస్ఐ, చింతపల్లి